# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 145    బుధవారం | 06 డిసెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




8 లో..

## బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చోరీ

వెనుక అద్దాలు పగలగొట్టి ఆఫీస్‌లోకి చొరబాటు

రెండు కంప్యూటర్లను దొంగలించినట్టు సమాచారం




8లో..

## విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికితీయాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

తొలిమెట్టు అమలు తీరుపై జిల్లా స్థాయి సమీక్ష



## సంపత్ కుటుంబాన్ని పరామర్శించి బోయినపల్లి

జనగాం జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్ రెడ్డి కుటుంబ సభ్యులను బుధవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ వైస్ చైర్మన్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ పరామర్శించారు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి చురుకుగా ప్రజాసేవలో పాల్గొన్న గొప్ప వ్యక్తి సంపత్ రెడ్డి అని కొనియాడారు. తాను ఎంపిగా కొనసాగిన సమయంలో సంపత్ రెడ్డి ముఖ్య అనుచరుడిగా ఉన్నాడంటూ ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

**- వరంగల్ వాయిస్, జనగాం**


## రేవంత్‌ను కలిసిన మార్నేని



తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న అనుముల రేవంత్ రెడ్డిని బుధవారం ఢిల్లీలో టీపీసీసీ కార్యదర్శి మార్నేని వెంకటేశ్వర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబోకే ఇచ్చి, శాలువాకప్పి అభినందనలు తెలిపారు.

**- వరంగల్ వాయిస్, వరంగల్**

# రేవంత్ రెడ్డి అను నేను..



### ముహూర్తం 1.04

రేపు సీఎంగా ప్రమాణ స్వీకారం

ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు

హాజరు కానున్న సోనియా, ఇతర ప్రముఖులు

కేసీఆర్, జగన్, చంద్రబాబుకు అందిన ఆహ్వానాలు

పెద్ద సంఖ్యలో తరలి రానున్న పార్టీ శ్రేణులు, ప్రజలు

తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం మధ్యాహ్నం 1.04 గంటలకు ప్రమణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ఎల్బీ స్టేడియంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ సీఎస్ శాంతకుమారి, డీజీపీ రవి గుప్తా అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అయితే మంగళవారం ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి బుధవారం కూడా అక్కడే ఉండి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. ప్రమాణ స్వీకారోత్సవానికి రావాల్సిందిగా వారిని ఆహ్వానించారు. మరోవైపు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను కూడా వ్యక్తి గతంగా కలిసి ఆహ్వానం పలికారు. దీంతో వారు ప్రమాణ స్వీకారోత్సవానికి వస్తున్నట్లు రేవంత్ కు హామీ ఇచ్చారు. అదే విధంగా మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, ఏపీ సీఎం జగన్, కర్నాటక సీఎం సిద్ధరామయ్య తదితర ప్రముఖులకూ ఆహ్వానాలు పంపారు. రాష్ట్రం నలుమూలలనుంచి లక్షమందికిపైగా ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కానున్నారు.

**- వరంగల్ వాయిస్, వరంగల్**

వివరాలు 2లో..

# రేవంత్ రెడ్డి అను నేను..



**ముహూర్తం 1.04**

**రేపు సీఎంగా ప్రమాణ స్వీకారం**

**ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు**

**హాజరు కానున్న సోనియా, ఇతర ప్రముఖులు**

**కేసీఆర్, జగన్, చంద్రబాబుకు అందిన ఆహ్వానాలు**

**పెద్ద సంఖ్యలో తరలి రానున్న పార్టీ శ్రేణులు, ప్రజలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎల్బీ స్టేడియంలో గురువారం మధ్యాహ్నం 1.04 గంటలకు తెలంగాణ నూతన సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్నారు. గవర్నర్ తమిళిసై ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. తొలుత గురువారం ఉదయం 10.28 గంటలకు రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా రేవంత్ ప్రమాణస్వీకారం చేయాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలతో మార్పులు చేశారు. అయితే ప్రమాణస్వీకార వేదికలో మాత్రం ఎలాంటి మార్పులు లేవు. ఎల్బీ స్టేడియంలోనే ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. అధికారులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి, డీజీపీ, పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు ఎల్బీ స్టేడియానికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

### పలువురికి ఆహ్వానం..

ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతోపాటు పలువురు ఏఐసీసీ నేతలను ఆహ్వానించారు. అలాగే కర్ణాటక సీఎం సిద్దిరామయ్య, డిప్యూటీ సీఎం డీకే. శివకుమార్, ఆ రాష్ట్ర మంత్రులను కూడా ఆహ్వానించారు. రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చౌహాన్, గతంలో ఇంచార్జిలుగా పనిచేసిన దిగ్విజయ్ సింగ్, వీరప్పమొయిలీ, కుంతియా, వాయిలార్ రవి, మాణిక్కం ఠాగూర్, మరికొందరు ముఖ్యులను రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన చిదంబరం, విరీరాకుమారి, సుశీల్ కుమార్ షిండే, కురియన్, మరికొందరు నేతలను కూడా ఆహ్వానించారు. తెలంగాణ అమరుల కుటుంబాలను కూడా పిలిచారు. కోదండరామ్, గాదె ఇన్నయ్య, హరగోపాల్, కంచ ఐలయ్యలతోపాటు మరికొందరు ఉద్యమ కారులు, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానాలు పంచారు. మాజీ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం జగన్, తమిళనాడు సీఎం స్టాలిన్ తోపాటు మాజీ సీఎం చంద్రబాబు, సినీ నటులను పిలిచారు. హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో పాటు వివిధ కుల సంఘాల నేతలు, మేధావులను రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. అదే విధంగా వివిధ రాజకీయ పార్టీల నేతలకు, సీనియర్ నాయకులకు రేవంత్ సంతకంతో కూడిన ఆహ్వాన పత్రాలను పంపారు.



### రేవంత్‌తో మరో ఎనిమిది మంది..

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డితో పాటు ఒక డిప్యూటీ సీఎం, మరో ఏడుగురు మంత్రులుగా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. రేవంత్ లక్కీ నెంబర్ తొమ్మిది కావడంతో క్యాబినెట్ కూర్పుకూడా తొమ్మిది మందితోనే ఉంటుందన్న ప్రచారం సాగుతోంది. మంత్రి వర్గంలో ఎవరెవరికి బెర్తులు ఖరారు కానున్నాయన్న విషయంలో కాంగ్రెస్ అధిష్టానం మల్లగుల్లాలు పడుతోంది. ఆ పార్టీలో సీనియర్ల సంఖ్య లెక్కకు మించి ఉండడంతో ఎవరికి పదవులు లభిస్తాయన్న విషయం త్వరలో తేలనుంది.









# బాలికలను రక్షిద్దాం..




**వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ తానాజీ వాకడే**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆడ పిల్లలను పుట్టనిద్దాం.. ఎదగనిద్దాం.. రక్షిద్దామని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ తానాజీ వాకడే పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావోపై సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లల ఎదుగుదలకు సమాజంలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షల చట్టంపై వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లకు అవగాహ కల్పించాలన్నారు. గ్రామాల్లో తరచు ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జరిమానా, జైలు శిక్షలపై ప్రజలకు వివరిస్తూ విరివిగా ప్రచారం చేయాలన్నారు. ముందస్తు త్రైమాసిక నివేదికలు తయారు చేసుకుని గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంబంధిత శాఖల సహకారంతో బాలిక సాధికారత దిశగా జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంపై గ్రామస్థాయి నుంచి సర్పంచులను అదేవిధంగా పట్టణ ప్రాంతాలలో వార్డ్ మెంబర్లను భాగస్వాములు చేస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. బేటి బచావో బేటి పడావోపై అవగాహన కార్యక్రమాలు ప్రతి మూడు నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని, దానికనుగుణంగా పాఠశాలల్లోని బాలికలకు ఆత్మస్థైర్యాన్ని కలిగించేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యా శాఖ అధికారిని కోరారు. వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంపై విసృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి శారద ముందస్తు ప్రణాళికతోపాటు సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ చేయాల్సిన విధి విధానాలను వివరించారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్ పావని పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా లైన్ డిపార్ట్మెంట్ విధి విధానాలను, బాధ్యతలను వివరించారు. వివిధ లైన్ డిపార్ట్మెంట్స్ మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, యూత్, క్రీడలు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్ర్యమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళు ౖటకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి కల్పన, సీడబ్ల్యూసీ చైర్ సర్సన్ వసుధ, ప్రాజెక్ట్స్ సీడీపీఓలు, సూపర్వైజర్లు, పోషణ అభియాన్, సఖి, చైల్డ్ లైన్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కరీమాబాద్ అంబేద్కర్ భవన్ దగ్గర తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో యువజన సంఘం అధ్యక్షుడు జక్కుల రాజు అధ్యక్షతన బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మల అంబేద్కర్, అంబేద్కర్ భవన కమిటీ అధ్యక్షుడు నీలం మల్లేశం హాజరై మహనీయుల విగ్రహాలకు పూలమాలలు అర్పించి బుద్ధి వందనం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలని ప్రతిజ్ఞ పూనారు. బాబా సాహెబ్ అంబేద్కర్ కన్న కలలు నెరవేర్చేందుకు అహర్నిశలు ప్రతి ఒక్క అంబేద్కర్ పోరాడాలని, భారత రాజ్యాంగాన్ని కాపాడాలని ఈ సందర్భంగా వారు బొమ్మల అంబేద్కర్ కొనియాడారు . ఈ సమావేశంలో వార్డు పెద్దలు కడారి కుమార్ మాతా రమాబాయి మహిళా సంఘం అధ్యక్షురాలు తరాల రాజమణి, కళావతి, మనోహర యువజన సంఘం నాయకులు సారయ్య, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేడు భారతరత్న, నవభారత రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీసర్కిల్ వరంగల్ లో అంబేద్కర్ కు ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎం. ఏర్రగట్టు స్వామి, దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షులు రౌతు రమేష్, వార్డెన్ క్రిష్ణ, తెలంగాణ చరిత్ర ఫ్యాకల్టీ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఎలక్ట్రిసిటీ సబ్ డివిజన్ ఆఫీసులో ..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతరత్న, భారతదేశ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా హనుమకొండ రూరల్ సబ్ డివిజన్ ఆఫీసులో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రి.నం.202/2010 అధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి బక్క దానయ్య, ఏడీఈ, కంపెనీ ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు తౌర్య, బాబు, కంపెనీ ట్రెజరర్ స్వదేశ్ కుమార్ ఏఈ, చలపతి, రవి, విజయ్, విజయరాజు, శ్యామ్ కుమార్, కొమ్ము రవి, రాజు, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు కదలాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపిన మార్గంలో యువత ముందుకు కదలి దేశ భవిష్యత్తుకు పునాదులు వేయాలని గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావుల వెంకట రమేష్ యువతకు పిలుపునిచ్చారు. గోపాలపురంలోని గ్రామపంచాయతీ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం ముందుకు నడవాలని యువతకు సూచించారు.

# అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం హరించి వేస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బహుజనులు ముందుకు సాగాలన్నారు. లాల్ జెండాలు ఎత్తుకొని అంతరాలు లేని నవ సమాజ నిర్మాణానికి ఉద్యమించాలన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగం మూల సూత్రాలకు విఘాతం కలిగిస్తూ మనువాదాన్ని పరిపాలనలో బలవంతంగా చొప్పిస్తూ లౌకిక దేశాన్ని మనువాద దేశంగా మార్చే కుట్రలకు దిగుతున్నదని అన్నారు. రిజర్వేషన్ల ను ఎత్తివేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందకుండా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇలాంటి వినాశకర విధానాలను విడనాడి లౌకిక పరిరక్షణకై పాటుపడాలని, లేకుంటే ఐక్య ఉద్యమాలతోనే తిప్పికొడతామని హెచ్చరించారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన అందించిన రాజ్యాంగ స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా సమితి సభ్యులు కొట్టెపాక రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్, నాయకులు రమేష్ దేవా, పూర్ణ చందర్, ఎర్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## బీఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండల కేంద్రంలోని జనగామ-సూర్యాపేట రహదారి చౌరస్తాలో దేవరుప్పుల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పుల ఉప్పలయ్య అధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయని, అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో ఆయన అడుగుజాడల్లోనే మేము ముందుకు వెళతామన్నారు. అంతే కాకుండా నూతనంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రేపు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్నందుకు, పాలకుర్తి నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలుపొందిన యశస్విని రెడ్డిలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా సజ్జన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాసంపెల్లి మహేందర్, పులిగిల్ల వెంకన్న, రవి, ఈదునూరి వెంకట్ రెడ్డి, చలమారెడ్డి, బట్ట అబ్బయ్య, తోటకూరి రమేష్, సందీప్, కొడాలి అంజయ్య, సీత మల్లయ్య, దయ్యాల వెంకటేష్, అయోధ్య, శ్రీను, యువ నాయకులు ఉప్పుల అనిల్, ఉమేష్, నిఖిల్, ప్రకాశ్, ఉపేందర్, శ్రీకాంత్, సందీప్, సాయి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయసాధనకు కృషి చేయండి



**వరంగల్ వాయిస్, పరకాల :** భారత రత్న, స్వర్గీయ. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశానుసారం బుధవారం ఉదయం 8:00గంటలకు బీఆర్ఎస్ పరకాల పట్టణ కమిటీ అధ్వర్యంలో స్థానిక పరకాల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయసాధనలో పయనించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ జీవిత చరిత్రను తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పరకాల పట్టణ అధ్యక్షుడు డాక్టర్ మడికొండ శ్రీను, మునిసిపల్ చైర్ పర్సన్ సోదా అనితా రామకృష్ణ, వైస్ ఛైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, కౌన్సిలర్లు మడికొండ సంపత్ కుమార్, ఒంటేరు సారయ్య, గొర్రె స్రవంతి రాజు, శనిగరపు రజినీ నవీన్, ఏకు రాజు, యూత్ పట్టణ ప్రధాన కార్యదర్శి దుప్పటి సుజయ్ రణదేవ్, పార్టీ సంయుక్త కార్యదర్శి భట్టు రవి, వార్డు అధ్యక్షులు దామ అనిల్, ఏకు రఘుపతి, నాయకులు మేకల దేవయ్య, పొదిల రాజు, అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలను సాధిద్దాం

### మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిద్దామని, అంబేద్కర్ ఆశయాలను సాధిద్దామని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ పశ్చిమ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. అంబేద్కర్ సర్కిల్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. అణగారిన వర్గాలకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని తెలిపారు. అంబేద్కర్ జయంతి వర్ధంతులను నిర్వహించడంతో పాటు వారి ఖ్యాతిని తెలిసేలా వారోత్సవాలు మాస ఉత్సవాలు వార్షికోత్సవాలు నిర్వహించుకోవాలని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు కారకుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. సాధారణంగా అంబేద్కర్ పేరును గ్రామానికి వీధికో ఏర్పాటు చేసుకుంటారని, కానీ కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం సచివాలయాన్ని, 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అంబేద్కర్ వారసులుగా ఆయన స్ఫూర్తిని మనం ముందుకు తీసుకెళ్దామన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడిన మహనీయుడు అంబేద్కర్, ఆయన స్ఫూర్తితో సమాజాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి, మాజీ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

# తుఫాను బాధిత రైతులను కాంగ్రెస్ ఆదుకుంటుంది



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మిచౌంగ్ తుఫానులో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, మానుకోట జిల్లా కాంగ్రెస్ నాయకుడు శంతన్ రామరాజు రైతులకు భరోసా ఇచ్చారు. శనిగపురంలోని వరి కల్లాలను, కోతకొచ్చిన వరి పంటలను పరిశీలించి స్థానిక ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ తో ఫోన్ లో మాట్లాడి రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మహబూబాబాద్ నియోజకవర్గంలో పంటలు దెబ్బతిన్నాయన్నారు. కోతకొచ్చిన వరి పంటలతో పాటు కల్లాల్లో ఉంచిన ధాన్యం తడిసిపోయిందని అన్నారు. అకాల వర్షానికి తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొంటుందని అన్నారు. గత ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొన్న సమస్యలు పునరావృతం కాబోవని రైతులకు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలతో పాటు అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేయడానికి ఎమ్మెల్యే మురళీ నాయక్ కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. ఇన్నిరోజులు వైద్యుడిగా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడిన ఎమ్మెల్యే మురళీ నాయక్ ఇప్పటి నుంచి సమాజంలో ఉన్న ప్రజా సమస్యలు, అసమానతలపై యుద్ధం చేస్తారని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన మానుకోటను ఎమ్మెల్యే మురళీ నాయక్ బంగారుకోట గా మారుస్తారని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. కాంగ్రెస్ పాలన అంటేనే ప్రజారంజకమైన పారదర్శక పాలన అని అన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాంశెట్టి ఉప్పలయ్య, ప్రేమ్ సాగర్ రామరాజు, సారయ్య, బాలరాజు, జాన్ విక్టర్, అలువాల వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

## మంత్రి వర్గంలో లంబాడీలకు చోటు కల్పించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మంత్రి వర్గంలో లంబాడీలకు చోటు కల్పించాలని ఇవ్వాలని ఎల్‌హెచ్‌పీఎస్ డిమాండ్ చేసింది. ఈ రోజు స్థానికంగా ఎల్‌హెచ్‌పీఎస్ సమావేశం హరిత హోటల్‌లో అత్యవసర సమావేశం ఎల్‌హెచ్ పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ సునీల్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్ సింగ్ నిట్ అధ్యాపకులు అంగోత్ వినోద్ లోక్ నాయక్ మాట్లాడుతూ 30లక్షలు జనాభా కలిగిన లంబాడీలకు ట్రైబల్ మినిస్టర్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సునీల్ నాయక్ మాట్లాడుతూ ఆదివాసీ మహిళ అయినా సీతక్కకు డిప్యూటీ సీఎంతో పాటు హోం మినిస్టర్ ఇవ్వాలని, దీన్ని స్వాగతిస్తూ లంబాడిలకు కూడా ట్రైబల్ మినిస్టర్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లకావత్ కరుణాకర్, జిల్లా అధ్యక్షుడు అజ్మీరా వెంకట్ నాయక్, లావుడియా శ్రీనునాయక్, మహేందర్ నాయక్, సుమన్ నాయక్, బీసీ నాయకులు సాంబయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ శశాంక



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తుఫాన్ ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తక్షణం స్పందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్ వాడీ కేంద్రాలు, వైద్య శాల, పాఠశాలలు ఉంటే ఖాళీ చేయించాలని రెవిన్యూ అధికారులను అదేశించారు. విద్యుత్ అధికారులు ప్రమాదాలు జరగకుండా సిబ్బందిని స్థానికంగా సిద్ధంగా ఉంచాలన్నారు. అతి వేగంగా గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా, పశువులు ప్రమాదాలు గురికాకుండా విడిచి పెట్టకుండా ఉండేందుకు చూడాలని అధికారులను అదేశించారు. రైతులు, రైతాంగ కూలీలు పొలాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే విద్యా సంస్థలకు సెలవు ప్రకటించామని చెప్పారు. చెరువుల వద్ద భద్రతకు ఇసుకతో నింపిన బస్తాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్థాయి అధికారులకు అదేశాలిచ్చారు. కేసముద్రం మండలంలోని అర్పణపల్లిని దృష్టిలో ఉంచుకుని అధికారులను అప్రమత్తంగా ఉండాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్ లు అదనంగా ఏర్పాటు చేసుకొని ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. కలెక్టర్ కార్యాలయం లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 24గంటలు నిర్వహణ కొనసాగిస్తున్నామని తెలిపారు.

## అంబేడ్కర్ స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి కృషి

### కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** డా. బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఖిలా వరంగల్ పడమర కోటలోని అంబేద్కర్ విగ్రహానికి బుధవారం కార్పొరేటర్ సువర్ణ సురేష్, స్థానిక నాయకులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి కార్పొరేటర్ సువర్ణ సురేష్ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్ల రిజర్వేషన్ లో భాగంగా ఒక దళిత మహిళా అయిన నేను కార్పొరేటర్ అయ్యానన్నారు. ఈ బాధ్యతలను అంబేద్కర్ స్ఫూర్తి తో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. నిరంతరం డివిజన్ ప్రజలతో మమేకం అయ్యి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ యూత్ అధ్యక్షుడు అభిషేక్, మాజీ అధ్యక్షుడు మేకల ఎల్లయ్య, బెల్లంకొండ సుధాకర్, గొర్రె నరేష్, మైదం రవి, హాజక్, ఆకునూరి చందు, అజయ్, నిఖిల్, ప్రేంసాగర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## లంబాడీలకు సముచిత స్థానం కల్పించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో లంబాడ గిరిజనులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా వెంకట్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అజ్మీరా వెంకట్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా 40లక్షలకు పైగా జనాభా కలిగిన లంబాడా గిరిజనులకు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం సిగ్గుచేటుగా భావిస్తామన్నారు. ఎందుకంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు విషయంలో లంబాడా గిరిజనులే కాంగ్రెస్ పార్టీ వెంట ఉండి ప్రధాన పాత్ర పోషించారని విషయాన్ని కాబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో పెట్టుకోవాలని లంబాడా గిరిజనులకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

## నాలుగో బెటాలియన్‌లో హోంగార్డ్ రైసింగ్ డే



**వరంగల్ వాయిస్, మామునూర్ :** నాలుగో బెటాలియన్ ఆవరణలో హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 61వ ఇండియన్ హోమ్ గార్డ్స్ రైసింగ్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కమాండెంట్ డి. శివ ప్రసాద్ రెడ్డి బెటాలియన్ లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డ్స్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ బెటాలియన్ లో విధులు నిర్వహిస్తున్న ప్రతి హోంగార్డ్ ఎంతో అంకితభావంతో, నిబద్ధతతో తమ విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. హోంగార్డ్స్ కు ఏమైనా సమస్యలు ఉంటే సత్వరం పరిష్కరించడానికి కృషి చేస్తామని, ఎల్లవేళలా అండగా నిలబడతామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు జయరాం, రాంబాబు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శోభన్, రమేష్, వెంకటేశ్వర్లు, దయాశీల, పురుషోత్తం రెడ్డి, రాజ్ కుమార్, అశోక్, అధికారులు, మినిస్టీరియల్ స్టాప్, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ వరంగల్ జిల్లా కార్యాలయంలో ..



**వరంగల్ వాయిస్, పరకాల :** భారత స్వాతంత్ర సమరయోధుడు, రాజ్యాంగ నిర్మాత, దళిత బలహీన వర్గాల వికాసానికి పాటుపడిన మహానేత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడు చేసిన సేవలను స్మరించుకుంటూ బుధవారం బీజేపీ వరంగల్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, పరకాల నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, మాజీ శాసనసభ్యుడు వన్నాల శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిటూరి అశోక్ , వరంగల్ తూర్పు నియోజకవర్గం నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి పెల్లి రాజేశ్వరరావు , జిల్లా కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతి కుమార్, పరకాల అసెంబ్లీ కన్వీనర్ మూల్క ప్రసాద్, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతి రెడ్డి, 16వ డివిజన్ అధ్యక్షుడు గోదాసి అశ్విని కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాధి నిరోధక టీకాల కేంద్రాల సందర్శన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బయ్యారం, గంధంపల్లి, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం డీఎంహెచ్ ఓ డాక్టర్ ఏ.అబంరీష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికి టీకాలు 100 శాతంవేయించాలని, గర్భిణీ స్త్రీలందరినీ 12 వారాల లోపు నమోదు చేయాలని, రక్తహీనత గుర్తించి వారికి ఐరన్ ఫోలిక్ టాబ్లెట్స్ ఇచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, 30 సంవత్సరాల పైబడిన వారందరినీ, అసంక్రమిత వ్యాధులైన, బిపి షుగర్ క్యాన్సర్ వ్యాధులను గుర్తించి, చికిత్స అందించే లాగా, అవగాహన కల్పించాలని చెప్పారు. కుష్టి వ్యాధికి సంబంధించి, రాగి వర్ణము గల మచ్చలు గాని లేదా స్పర్శ లేని మచ్చలు గాని ఉన్నచో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. ముందుగా గుర్తించి చికిత్స తీసుకొన్నచో అంగవైకల్యం రాకుండా కాపాడగలుగుతామని, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు ప్రజలలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ సాగర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ , కృష్ణార్జునరావ్, కేవీ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డబోయిన శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గొప్ప గులాబీ సైనికుడిని కోల్పోయాం




**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** గొప్ప గులాబీ సైనికుడిని కోల్పోయామని, బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు నడిపిన నాయకుడు పాగాల సంపత్ రెడ్డి అని మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ జనగాం జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ పాగల సంపత్ రెడ్డి అకాల మరణానికి చింతిస్తూ సంస్మరణ కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. మొదట పాగాల సంపత్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జోహార్ సంపత్ రెడ్డి అంటూ నినదించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ పార్టీ కోసం, కార్యకర్తల కోసం పనిచేసిన నాయకుడు సంపత్ రెడ్డి అని అన్నారు. జనగాం జిల్లాలో పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. కార్యకర్త స్థాయి నుంచి పార్టీ జిల్లా అధ్యక్ష స్థాయి వరకు ఎదిగిన నేతని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ ఏ బాధ్యతలు అప్పగించిన సమర్థవంతంగా నిర్వహించిన నాయకుడని అన్నారు. సంపత్ రెడ్డిని కోల్పోవడం పార్టీకి నాయకులకు, కార్యకర్తలకు తీరని నష్టమని అన్నారు. తెలంగాణ కోసం జరిగిన ఉప ఎన్నికల్లో పార్టీని గెలిపించిన ఘనత పాగాల సంపత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. జనగామ జిల్లా నుంచి పోటీ చేసిన అభ్యర్థులను సైతం ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలిపించారని తెలిపారు. సంపత్ రెడ్డిని కోల్పోవడం పార్టీకి, వ్యక్తిగతంగా తనకు ఎంతో వేదనలను కలిగించిందని అన్నారు. సంపత్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు, తాను అండగా ఉంటామని అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సైతం తెలిపారు. కార్యక్రమంలో కూడా మాజీ చైర్మన్ సుందర్ రాజు యాదవ్, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం బీఆర్ఎస్ కోఆర్డినేటర్ జనార్దన్ గౌడ్, కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

# కుల రహిత సమాజాన్ని నిర్మించాలి



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని 31వ డివిజన్ న్యూ శాయంపేట్ పార్టీ కార్యాలయంలో డా బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మామిండ్ల రాజు మాట్లాడుతూ బలహీన వర్గాల ప్రజల పక్షాన పోరాడి భారత రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను, సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసి కుల రహిత సమాజాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ప్రసాద్, సతీష్, రమేష్, సల్మాన్, డేవిడ్, క్రాంతి పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌ను కలిసిన సుధాకర్ గౌడ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఢిల్లీలోటీపీసీసీ అధ్యక్షుడు, తెలంగాణ తొలి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బుధవారం పీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మారినేని వెంకటేశ్వర్ రావు ఉన్నారు.

# అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

## మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



**వరంగల్ వాయిస్, పరకాల :** భారత రాజ్యాంగ రూపకర్త, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని కృషి చేసిన మహానుభావుడు డా.బీఆర్ అంబేద్కర్ వర్థంతి సందర్భంగా పరకాల పట్టణ బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ వర్థంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమ సమాజ స్థాపన కోసం సమానత్వం కోసం ఆయన కృషి ఎనలేనిదని అన్నారు . భారత రాజ్యాంగ శిల్పి, సంఘ సంస్కర్త మహా మేధావి అని కొనియాడారు. వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరం పాటుపడాలని పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల కోసం వివక్షలపై అలుపెరుగని పోరాటం చేసి ఎన్నో అవమానాలను ఎదుర్కొని అస్తిత్వ ఉద్యమాలకు ఊపిరి పోసి సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు బాసాని సోమరాజు, జిల్లా నాయకులు వీసం రమణారెడ్డి, దామర మండల అధ్యక్షులు జంగిలి నాగరాజు, ఇరుసడ్ల సదానందం, గోగుల రాజిరెడ్డి, సీనియర్ నాయకులు దుబాసి వెంకటస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, భాస్కరాచారి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, నాగారం మాజీ సర్పంచ్ మాచబోయిన బాబు, దారుణ నారాయణదాసు, బాలాజీ మురళి కృష్ణ, దుబాసి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

## ఎస్పీ సంగ్రామ్ సింగి జీ పాటిల్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మిచౌంగ్ తుఫాన్ ప్రభావం వలన గత రెండు రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు ఉంపొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం గార్ల మండల శివారులోని పాకాల వాగును జిల్లా ఎస్పీ సందర్శించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎగువన వర్షాలు భారీగా కురుస్తున్నందున పాకాల ఏటి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. గార్ల-రాంపురం మార్గం మధ్యలో ప్రవహిస్తున్న పాకాల ఏరు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున ఆయా గ్రామాలలో ఎవరన్న ఎమర్జెన్సీ ప్రెగ్నెన్సి మహిళలు ఉంటే వారిని గార్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించేలా అధికారులు వారికి సమాచారం అందించాలని అన్నారు. పాకాల ఏటి ఉధృతిని ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గార్ల, బయ్యారం సీఐ, ఎస్ఐలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, గార్ల, బయ్యారం సీఐ బాబూరావు, గార్ల ఎస్ఐ బానోత్ వెంకన్న పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాబా సాహెబ్ ఆశయ సాధనకు పనిచేయాలి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** రాజ్యాంగ నిర్మాత భారతరత్న, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు భీంరావు అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు మాట్లాడుతూ భీంరావు అంబేద్కర్ (14 ఏప్రిల్ 1891 జన్మించి, ఒక భారతీయ న్యాయవాది, ఆర్థికవేత్త, రాజకీయవేత్త, సామాజిక సంస్కర్త అని కొనియాడారు. అతను దళిత బౌద్ధ ఉద్యమాన్ని ప్రేరేపించాడని, అంటరాని వారి (దళితుల పట్ల సామాజిక వివక్షకు వ్యతిరేకంగా ప్రచారం చేశారన్నారు. మహిళలు, కార్మిక హక్కులకు కూడా మద్దతు ఇచ్చాడని 'స్వతంత్ర భారతదేశపు మొదటి న్యాయ మంత్రి, భారత రాజ్యాంగం ప్రధాన వాస్తుశిల్పి, భారత రిపబ్లిక్ వ్యవస్థాపకుడిగా బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రసిద్ధి చెందాడని అన్నారు. సమాజంలోని ఉన్నత వర్గ ప్రజలు, పేదలు, అణగారిన వారిపై తీవ్రమైన దారుణాలకు, దోపిడీకి పాల్పడుతున్న సమయంలో అతను భారత రాజ్యాంగాన్నిసృష్టించాడని అన్నారు. ఈ కార్యక్రమంలో గంగారం శ్రీనివాస్ బొడ్డు శాంతి స్వరూప్, చిలుక రాజు, శ్రీనివాస్, బొడ్డు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# బుగులోని జాతర ఆదాయం రూ.4,55,825



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని తిరుమలగిరి శివారు శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర ఆదాయం మొత్తం రూ.4,55,825లు భక్తులు సమర్పించిన హుండీల ద్వారా వచ్చిందని ఆలయ ఈవో బిల్లా శ్రీనివాస్, దేవస్థాన పరిశీలకులు డి.అనిల్ కుమార్ లు తెలిపారు. శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర నవంబర్ 26నుంచి డిసెంబర్ 1వరకు జరిగిన జాతరలో భక్తులు వేసిన 8హుండీలను లెక్కించడం జరిగిందన్నారు. తిరుమలగిరి గ్రామ శివారులో ఎత్తయిన గుట్టలపై ప్రతి ఏటా వారం రోజుల పాటు శ్రీ స్వామివారి జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన హుండీలను బుధవారం రైతు వేదిక కార్యాలయంలో పలువురు ప్రజా ప్రతినిధులు, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యుల సమక్షంలో విప్పి లెక్కించగా నోట్ల ద్వారా 4,37,105, నాణేముల ద్వారా 18,720, మొత్తం 4,55,825,రూపాయల ఆదాయం వచ్చాయని ఈవో శ్రీనివాస్, పరిశీలకులు అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఈ హుండీల లెక్కింపులో కార్యక్రమంలో ఏవో పెద్ది వాసుదేవారెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ కడారి జనార్దన్, స్థానిక సర్పంచి కట్ల రాణి మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ గంట గోపాల్, ఉపసర్పంచ్ సుంకరి మనోహర్,అర్చకులు కుర్మాశలం వెంకటశ్వర్లు, కళాకారుల బృందం మహిళలు, కళాకారుడు నిమ్మల రాజు, ఆలయ సిబ్బంది కొమ్మురాజు రవి, గోరంట్ల శ్రావణ్, సొన్నాయిల సుధాకర్, పోలీస్ సిబ్బంది మరియు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు..

# మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

## అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ, మహబూబాద్ జిల్లాలలో గత మూడు రోజుల నుంచి మిచౌంగ్ తుఫాను తీవ్ర నష్టాన్ని కలగజేసింది. తుఫాను, అల్పపీడనాలతో భారీగా వర్షాలు పడి వేలాది ఎకరాలలో వరి, పత్తి, మిరప తదితర పంటలు తడిసిపోయాయి. ఈ కారణంగా రైతులకు తీవ్ర నష్టం జరిగిందని, భారీ వర్షాల వల్ల వరి పంట నేలకు పడిపోయి తీవ్ర నష్టం జరిగిందని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. మహబూబాబాద్ టౌన్ లోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన ప్రసంగించారు. ఈ తుఫాన్ వలన పత్తి, మిరప తదితర పంటలు నాని పోయి చేతికి రాకుండా పోయాయని, ఆరు గాలం కష్టపడి పడ్డించిన పంటలు తుఫాను తాకిడికి ధ్వంసం కావడంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడ్డారని అన్నారు. గత నెల రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైతులు కల్లాల దగ్గర ధాన్యం పోసుకున్నారని, వరి ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయనందున కల్లాలలో వరి ధాన్యం తడిసిపోయిందని ఆయన అన్నారు. పత్తి, మిరప తదితర పంటలకు నష్టం జరిగింది. రోడ్లపై ఆరబెట్టుకొన్న మొక్కజొన్నలు తడిసి ముద్దయ్యాయని, కొనుగోలు కేంద్రాలలో దాన్యాన్ని కాపాడుకోవటానికి ప్రభుత్వం వైపునుండి టార్పాలిన్ పట్టాలను కూడా సరఫరా చేసే పరిస్థితి లేదని అన్నారు. తడిసిన వరి, మొక్కజొన్న, పత్తి, మిరప తదితర పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కల్లాలలో ఉన్న వరి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని గుర్తించి నష్టపరిహారం ఇవ్వాలని, ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జు దేవేందర్, అరుణోదయ జిల్లా కార్యదర్శి చారి హరీష్, పీడీఎస్ యూ జిల్లా కార్యదర్శి బోనగిరి మధు, పీవైఎల్ జిల్లా కార్యదర్శి భట్టు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప నాయకుడిని కోల్పోయాం

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జనగామ జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు స్వర్గీయ పాగాల సంపత్ రెడ్డి సంతాప సభ జరిగింది. ఈ సంతాప సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు స్వర్గీయ పాగాల సంపత్ రెడ్డి అకాల మరణం పార్టీకి, తమకు తీరని లోటును మిగిల్చిందన్నారు. పాగాల సంపత్ రెడ్డి పార్టీని క్రియాశీలంగా నడిపించడంతో పాటు కార్యకర్తలకు అండగా నిలబడ్డారని గుర్తుచేశారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. సంపత్ రెడ్డి కుటుంబానికి పార్టీ, పార్టీ నాయకులు, పార్టీ కుటుంబ సభ్యులు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎడవెల్లి కృష్ణారెడ్డి , మున్సిపల్ చైర్మన్ పోకల జమున, ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పాగాల సంపత్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

## సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను పాలక ప్రభుత్వాలు హరించి వేస్తున్నాయని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శివనగర్ తమ్మెర భవన్లో అంబేద్కర్ చిత్ర పటానికి పువ్వుల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేకల రవి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన అందించిన రాజ్యాంగ స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్ మియా, కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మణ్, డీహెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షుడు సంగీ ఏలేంధర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్క సుధీర్, నాయకులు యాకాంబ్ర చారి, రాజేందర్, వేంకటాద్రి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ గొప్ప స్ఫూర్తి ప్రదాత



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** భరతమాత ముద్దుబిడ్డ, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం తొర్రూరులో బీజేపీ ఎస్సీ మోర్చా అర్బన్ అధ్యక్షుడు మంగళపల్లి యాకయ్య ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ తొర్రూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు పల్లె కుమార్ మాట్లాడుతూ భరతమాత గర్వించదగ్గ మహా నేత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు. అత్యంత నిరుపేద కుటుంబంలో పుట్టి ఎన్నో అవమానాలు ఎదుర్కొని, కష్టాలెదురైనా భరించి కష్ట పడి చదువుకొని ప్రపంచ మేధావుల సరసన నిలిచిన అంబేద్కర్ జీవితం స్ఫూర్తి దాయకం అని తెలిపారు. ప్రపంచంలోని ఆయా దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి అత్యుత్తమ రాజ్యాంగం మనకు అందించిన అంబేద్కర్, బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్ లు కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేసి వారి పాలిట దైవం గా మారిపోయారన్నారు. నేడు అంబేద్కర్ రాజ్యాంగం చలువ వల్లనే నరేంద్ర మోడీ లాంటి పేదవాడు ఈ దేశానికి ప్రధాని కాగలిగాడని తెలిపారు. అంబేద్కర్ విగ్రహం పార్లమెంట్ లో ఏర్పాటు చేసి వారికి ఘన నివాళి అర్పించిన మోదీ, అంబేద్కర్ జీవితంతో ముడిపడిన ఐదు ప్రాంతాలను పాంచారామాల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి వాటిని స్మృతి వనాలుగా, ప్రసిద్ధి చెందిన తీర్థ స్థలాలుగా అభివృద్ధి చేశారని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి 15వ వార్డు కౌన్సిలర్ కొలుపుల శంకర్, ఎస్సీ మోర్చా మహబూబాబాద్ పార్లమెంటు ఇంచార్జి అలిసేరి రవిబాబు, అర్బన్ ప్రధాన కార్యదర్శి పైండ్ల రాజేష్, జిల్లా,మండల నాయకులు సీహెచ్ విజయ్ కుమార్, గడల శేఖర్, జలగం రవి, కాగు నవీన్, నడిగడ్డ ఉపేందర్, చలపతి రాజ్, నడిగడ్డ సందీప్, నూకల నవీన్, జగదీష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కుంకుమేశ్వరాలయంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, పరకాల :** కార్తీక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పరకాల పట్టణంలోని సుప్రసిద్ధ దేవస్థానమైన శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయంలో పరకాలకు చెందిన పంచగిరి భద్రమ్మ సారయ్య దంపతులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అల్పాహారాన్ని కడార్ల అర్చన రమణాచారి కుటుంబ సభ్యులు కడార్ల సూరమ్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, కార్య నిర్వహణ అధికారి పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** స్థానిక రెడ్డి కాలనీ ఎల్బీనగర్ పద్మశాలి సంఘం సభ్యుడు, యువకుడు ఇటీవల మరణించారు. అతడిని దశదినకర్మకు హాజరై ఆయన ఫోటోకు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు టవల్ కప్పి రూ. 7,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు భీమనాథుని సత్యనారాయణ, బుధారపు రాయమల్లు, పాసికంటి శ్రీనివాస్, గుండేటి శ్రీనివాస్, కైలాసం, శివ, బుక్ స్టాల్ శంకర్ పద్మశాలి తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ చింతగట్టు గ్రామానికి చెందిన నద్దునూరి సతీష్ హనుమకొండలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో బస్సు డ్రైవర్ గా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సతీష్ తన ఎడమ కాలును కోల్పోయారు. తెలంగాణ ఓరుగల్లు ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్స్, క్లీనర్స్ యూనియన్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దొడ్డిపాటి సారయ్య చేతుల మీదుగా బుధవారం హనుమకొండలోని నివాసంలో సతీష్ కు రూ.62,111 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బండి భాస్కర్, పాకాల చొక్కారావు, హరిప్రసాద్, అశోక్, రమేష్, రాములు, నరేష్, శ్రీనివాస్ హసన్పర్తి మండల శాఖ అధ్యక్షుడు దేశిని రాములుతో పాటు స్కిల్ స్టార్క్ డ్రైవర్స్ సైతం పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే అంబేద్కర్ ఆశయం

## కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణ టీం ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ సర్కిల్ లో భారత రత్న బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు నిర్వమించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. బోధించు, సమీకరించు పోరాడు అనే నినాదంతో దళిత జాతిని సంఘటితం చేశారన్నారు. దిగువ జాతులను పీడీస్తున్న అంటరాని తనం కులవివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడని తెలిపారు. అంటరాని కులాలు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా బలపడనిదే వారి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందనన్నారు. నేటి యువత అంబేద్కర్ ఆశయాలు సిద్ధాంతాలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిసెంబర్ 12న ..



టాలీవుడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం హనుమాన్. భారతీయ ఇతిహాసాల్లోని హనుమంతుని కథ స్ఫూర్తితో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండగా, ఇందులో జాంబి రెడ్డి కథానాయకుడు తేజ సజ్జా హీరోగా నటిస్తున్నాడు. ఇక సూపర్ హీరో సిరీస్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన టీజర్ హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో అందరినీ ఇంప్రెస్ చేస్తోంది. యూనీవర్సల్ ప్రేక్షకులను సైతం ఆకట్టుకునే హై టెక్నికల్ వాల్యూస్‌తో కట్ చేసిన విజువల్స్ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఈ సినిమా ట్రైలర్ ఎప్పుడు వస్తుందా ఎప్పుడెప్పుడు చూద్దామా అంటూ ప్రేక్షకులు తెగ వెయిటింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే సినిమా ట్రైలర్‌కు సంబంధించి మేకర్స్ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు. హనుమాన్ ట్రైలర్ అనౌన్స్‌మెంట్‌ను డిసెంబర్ 12న ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇక ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

# మళ్లీ భర్త డైరెక్షన్‌లో ..



లేడి సూపర్ స్టార్ నయనతార జోరు మామూలుగా లేదు. ఇటీవలే షారుక్ ఖాన్ 'జవాన్'తో నేషనల్ వైడ్ బ్లాక్ బస్టర్‌ని అందుకున్న ఈ భామ.. తాజాగా 'అన్నపూరణి' . సినిమాతో మరో బ్లాక్ బస్టర్ అందుకుంది. నయన్ కెరీర్‌లో 75వ సినిమాగా వచ్చిన ఈ సినిమాను నీలేష్ కృష్ణ దర్శకత్వం వహించాడు. ఇదిలా ఉంటే.. ఈ సూపర్ స్టార్ తాజాగా మరో కొత్త సినిమాతో వస్తుంది. అయితే ఈ సినిమాలో నయనతార ఓ యంగ్ హీరోకు అక్కగా నటించనున్నారట. తన భర్త విఘ్నేశ్ శివన్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నయన్ సిస్టర్ రోల్ చేయబోతుంది. 'లవ్ టుడే' సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన డైరెక్టర్ కమ్ హీరో ప్రదీప్ రంగనాథన్‌తో విఘ్నేశ్ శివన్ ప్రస్తుతం ఒక సినిమా చేయబోతున్నాడు. అయితే ఈ సినిమాలోనే ప్రదీప్‌కు అక్కగా నయనతార నటించనున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ జాన్వీ కపూర్ నటించనున్నట్లు సమాచారం. అయితే ఈ విషయంపై మూవీ మేకర్స్ ఇంకా అధికారిక అనౌన్స్‌మెంట్ చేయలేదు. మరోవైపు కమల్ హాసన్, మణిరత్నం కాంబోలో వస్తున్న తన డ్రీమ్ ప్రాజెక్ట్‌లో నటిస్తుంది నయనతార. అంతకుముందు విఘ్నేశ్ శివన్ డైరెక్షన్‌లో వచ్చిన నానుమ్ రౌడి ధాన్, కత్తువాకుల రెండు కాదల్ చిత్రాలలో నయనతార హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద హిట్గా నిలిచాయి.







# తల్లి శ్రీదేవి గౌనులో ..

శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషి కపూర్ కూడా హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఖుషి ' ది ఆర్చీస్' చిత్రం ద్వారా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తనయ సుహానా ఖాన్ కూడా నటిస్తోంది. ముంబైలోని నీతా ముకేశ్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో గత రాత్రి ఈ చిత్ర ప్రీమియర్ షో నిర్వహించారు. ఈ షోకు జాన్వీ కపూర్‌తో పాటు బాలీవుడ్ తారలంతా హాజరయ్యారు. ఇక ఈ షోలో ఖుషి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలి చిత్రం కావడంతో సెంటిమెంట్‌గా తన తల్లి శ్రీదేవి డ్రెస్‌లో ఈవెంట్‌కు హాజరై అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. బంగారు వర్ణంలోని స్ట్రాప్‌లెస్ గౌను ధరించి తన తల్లికి ప్రత్యేకమైన రీతిలో నివాళులర్పించింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. అంతేకాదు, తల్లి ఆభరణాలను కూడా వేసుకుంది. షారుఖ్ ఖాన్ గారాలపట్టి సుహానా ఖాన్, శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్, అమితాబ్ మనువడు అగస్త్య నంద ప్రధాన పాత్రల్లో అరంగేట్రం చేస్తున్న చిత్రం 'ది ఆర్చీస్' . గల్లీ బాయ్, జిందగీ నా మిలేగీ దోబారా, లస్ట్ స్టోరీస్ చిత్రాల ఫేం బాలీవుడ్ స్టార్ దర్శకురాలు జోయా అక్తర్ ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ లో డిసెంబర్ 7 ఈ చిత్రం విడుదలకానుంది.

# పెళ్లిపీఠలెక్కబోతున్న టాలీవుడ్ హీరోయిన్

రంగులరాట్నం, ఉనికి, తెల్లవారితే గురువారం చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న టాలీవుడ్? అందాల హీరోయిన్ చిత్ర శుక్ల పెళ్లిపీటలెక్కబోతుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ పోలీస్? అధికారితో చిత్ర శుక్ల ఏడడుగులు వేసేందుకు రెడీ అయింది. మరో రెండు రోజుల్లో వివాహం జరగనుండగా, ప్రస్తుతం ఈ ఇద్దరూ పెళ్లికి ముందు జరిగే కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఇక ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను చిత్ర శుక్ల సోషల్? మీడియాలో పోస్ట్ చేసింది. మధ్యప్రదేశ్‌కి చెందిన చిత్ర శుక్లా.. పులి, నేను శైలజ లాంటి సినిమాల్లో సైడ్ క్యారెక్టర్‌గా నటించి తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 2016 లో శ్రీవిష్ణు హీరోగా వచ్చిన 'మా అబ్బాయి సినిమాతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం తెలుగులో 'రంగుల రాట్నం', సిల్లీ ఫెలోస్, తెల్లవారితో గురువారం, పక్కా కమర్షియల్, ఉనికి, హంట్ తదితర చిత్రాల్లో నటించింది.

# విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికితీయాలి

**హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**తొలిమెట్టు అమలు తీరుపై జిల్లా స్థాయి సమీక్ష**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీసి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. హనుమకొండ జిల్లా పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులు, ఎంఎన్ ఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో బుధవారం లష్కర్ బజార్ లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ హై అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని దిశా నిర్దేశం చేశారు. సీపీడీ సెల్, వరంగల్ డైట్, ఎస్ ఆర్ జీ గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల్లో సామర్థ్యాలు సాధించేందుకు రూపొందించిన ఎఫ్ ఎల్ ఎన్, ఉన్నతి కార్యక్రమాల అమలు, పర్యవేక్షణపై అవగాహన కల్పించారు. డీఈవో అబ్దుల్ హై మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని, అవగాహనతో కూడిన అభ్యసనాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. పదవ తరగతి ఫలితాల్లో జిల్లా అగ్రస్థాయిలో నిలిచేలా కార్యక్రమాన్ని రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, డైట్ వరంగల్ సీపీడీ సెల్ కు చెందిన ఎస్ ఆర్ జీలు మధుసూదన్ రెడ్డి, కె.సంపత్ కుమార్, వి.శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో గాడితప్పిన పాలన

**డిపార్ట్ మెంట్‌లను నిర్వీర్యం చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్**

**వివిధ సమస్యలపై వినతి**



**వరంగల్ వాయిస్, కేయూ :** గత రెండున్నర సంవత్సరాలుగా కాకతీయ యూనివర్సిటీలో పాలన భ్రష్టు పట్టిందని, టీచర్లను వ్యక్తిగతంగా హింసిస్తూ మనోవేదనకు గురిచేస్తున్నారని కేయూ ఆకుట్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, డాక్టర్ మామిడాల ఇస్తారి ఆరోపించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వాన్ని కలుస్తామని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్ రావును కలిసి 10 పాయింట్ల ఎజెండాతో కూడిన వినతి పత్రం అంద చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని అన్ని విభాగాలను నిర్వీర్యం చేసేందుకు వీసీ, రిజిస్ట్రార్ కుట్రలు పన్నారని ఆరోపించారు. కనీసం డిపార్ట్ మెంటల్ కమిటీలు కూడా రెండేళ్ల నుంచి రెన్యూవల్ చేయలేదన్నారు. డిపార్ట్ మెంట్ కమిటీల ద్వారా జరగాల్సిన బదిలీలు, నియామకాలను నిబంధనలకు విరుద్ధంగా వీసీ, రిజిస్ట్రార్ లే ఇష్టారాజ్యంగా చేస్తున్నారని ఆరోపించారు. వివిధ విభాగాల్లో హెడ్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ లను ప్రతి రెండేళ్ల కొకసారి మార్చాల్సి ఉండగా కొన్ని డిపార్ట్ మెంట్ లలో ఇప్పటి వరకు కొత్త వారిని నియమించకుండా వ్యక్తి గత కక్షలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గత సంవత్సరం కింద ప్రమోషన్ల కొరకు అప్లై చేసుకున్న టీచర్లకు ఇప్పటి వరకు ఇంటర్వ్యూ లు నిర్వహించకుండా అధికారులు మాత్రం సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్ లను నియమాలకు విరుద్ధంగా తీసుకున్నారన్నారు. అధికారులు రిటైర్ అయ్యే తేదీ చివరి రోజు సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్లు తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వారికి కావాల్సిన వారికి ప్రమోషన్ల ఇచ్చి కొందరు టీచర్లకు సీనియర్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ ప్రమోషన్లు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. వ్యక్తిగత కుట్రలతో పాలన కొనసాగిస్తూ యూనివర్సిటీ సమస్యలను పట్టించుకోకుండా షోకాజ్ నోటీసులు, క్రమశిక్షణా చర్యలు, బదిలీల పేరుతో టీచర్లను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆకుట్ 10 పాయింట్ల ఎజెండాపై కేయూ అధికారులు స్పందించకుంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని కలుస్తామని, అక్రమాలను వెలికి తీసి, టీచర్ల సమస్యలను తీర్చడానికి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రిజిస్ట్రార్ కు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆకుట్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ బ్రహ్మేశ్వరీ, ఈసీ మెంబర్ డాక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి

**పౌరహక్కులను గౌరవించాలి**

**వరంగల్ పౌర స్పందన వేదిక విజ్ఞప్తి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో నూతనంగా కొలువు దీర బోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలిస్తూ పౌర హక్కులను గౌరవించాలని వరంగల్ పౌర స్పందన వేదిక అధ్యక్షుడు కరేటి శంకర్ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హనుమకొండలో నిర్వహించిన సమావేశంలో శంకర్ రావు మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అవలంభించిన నిరంకుశ, నిర్బంధాలపై ప్రజలు విసిగి వేసారి పోయారని, అందుకే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలించి ప్రజామోదం పొందాలని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగులు, నిరుపేదల జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేయాలని, పౌర ప్రజాస్వామిక హక్కులను గౌరవించాలన్నారు. వేదిక ప్రధాన కార్యదర్శి నల్లెల్ల రాజయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ అవినీతిపై గళమెత్తిన విద్యార్థులు, మేధావులు, ప్రజా స్వామ్యవాదులు, న్యాయ వాదులు, జర్నలిస్టులు నిరంతరం చేసిన ఉద్యమాల ఫలితంగానే కరుడు కట్టిన బీఆర్ ఎస్ ప్రభుత్వం మట్టి కరిచిందన్నారు. ఈ సమావేశంలో వేదిక గౌరవ సలహాదారులు యాదగిరి, రాజు దేవర తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చోరీ

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చోరీ జరిగింది. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియడం, ఇక్కడినుంచి పోటీ చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకట రమణారెడ్డి ఓటమి పాలు కావడంతో గత రెండు రోజులుగా పార్టీ కార్యాలయంలో సందడి తగ్గింది. దీంతో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయం వెనుక అద్దాలు పగలగొట్టి ఆఫీస్ లోకి చొరబడి రెండు కంప్యూటర్లను దొంగలించినట్టు తెలిసింది. ఈ మేరకు రమణారెడ్డి పీఏ వినోద్ భూపాలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# మాకు రోడ్డు వేయండి

**తండా వాసుల ఆందోళన**



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తమ తండాకు సరైన రవాణా సదుపాయం కల్పించాలంటూ గత పది సంవత్సరాలుగా అధికారులను వేడుకుంటున్నా స్పందించకపోవడంతో ఆగ్రహించిన సిగ్నల్ తండా వాసులు బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని డోర్నకల్ పట్టణ పరిధిలోని 4వ వార్డు సిగ్నల్ తండా వాసులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్సీబీసీ కాలనీ సమీపంలోని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఐటీడీఏ శాఖ నుంచి రూ.52 లక్షల నిధులు మంజూరైనా ఎన్నికల పేరుతో మట్టిని వేసి వదిలేశారని ఆరోపించారు. అప్పటి నుంచి సంబంధిత కాంట్రాక్టర్, ఏఈ జాడ లేకుండా పోయిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారిపై పోసిన మట్టిలో నీరు చేరి బురద మయంగా మారిందన్నారు. దీంతో తమ తండాకు కాలి నడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని అవేదన వ్యక్తం చేశారు. దీంతో రాకపోకలు స్తంభించాయి. విశయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మున్సిపల్ కమిషనర్ తో చర్చించి సమస్యను త్వరగా పరిష్కరిస్తామంటూ హామి ఇవ్వటంతో తండా వాసులు నిరసన విరమించారు.

# ఎంజీఎంను సందర్శించిన డీఐఓ డాక్టర్ ప్రకాష్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నర్సంపేట డిప్యూటీ డీఎంహెచ్ ఓ, డీఐఓ డాక్టర్ ప్రకాష్ బుధవారం ఎంజీఎం హస్పిటల్ పీపీ యూనిట్ లో రొటీన్ ఇమ్యూనైజేషన్ ను సందర్శించారు. ఈ సంధర్బంగా వాక్సిన్ నిల్వల రికార్డులను పరిశీలించారు. అన్ని రకాల వాక్సిన్ లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ విద్యాసాగర్ రెడ్డి, పీహెచ్ఎం సుభాషిణి, రామ రాజేష్ ఖన్నా, ఏఎన్ఎం సులోచన, తదితరులు పాల్గొన్నారు.

# దళారులను నిలదీయండి

**మావోయిస్టు డివిజన్ కమిటీ కంకణాల రాజిరెడ్డి**

**వరంగల్ వాయిస్, ములుగు :** పత్తి, వరి కొనుగోలులో మోసాలకు పాల్పడుతున్న దళారులు, మిల్లర్లను రైతులు నిలదీయాలని మావోయిస్టు (జేఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు వరి పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే తేమ, ఇసుక, తాలు పేరుతో కోత విధిస్తూ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. మిల్లర్లు ఇష్టారాజ్యంగా కోత విధిస్తున్నారని పేర్కొన్నారు. సీసీఐ మార్కెట్‌కు తీసుకెళ్లిన పత్తిని ఒకరిద్దరు రైతులను ఎంపిక చేసి మిగతా వారిని గాలికి వదిలేస్తోందని, దీన్ని ఆసరాగా చేసుకున్న కొనుగోలుదారులు, పత్తి మిల్లుల యజమానులు సిండికేట్‌గా మారి ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువకు కొంటున్నారని పేర్కొన్నారు. హమాలీ ఖర్చుల కింద క్వింటాకు రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారని, ఈ దోపిడీని మార్చుకోకపోతే రైతులు తిరగబడి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పాలక వర్గాలు ఇవేవీ పట్టించుకోకుండా వ్యాపారుల వద్ద కమీషన్లు తీసుకుంటూ చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇకన్నైనా దళారులు, మిల్లర్లు రైతులను మోసం చేసే పద్ధతిని మార్చు కోవాలని, లేనిపక్షంలో ప్రజా ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com